క్లుప్తంగా

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పొదలకూరు : మండలంలోని నావూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సోషల్ టీచర్ ఎస్.శ్రీనివాసులు పరీక్ష ప్యాడ్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్నట్లు వివరించారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పొదలకూరు : మండలంలోని మరుపూరు జెడ్పీహైస్కూల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు రెండో విడత పనులను ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ ఎ.శ్రీనివాసకుమార్ సోమవారం పరిశీలించారు. అదనపు తరగతి గదులకు సంబంధించి పనుల నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ మహేంద్ర, సర్పంచ్ నాగయ్య తదితరులు ఉన్నారు.

రసీదులు పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : రబీకి సంబంధించి పంట నమోదు చేసుకున్న రైతులు ఆర్బీకేల్లోని వీఏఏలను సంప్రదించి రసీదులు పొందాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని రేగడిచెలిక ఆర్బీకేలో వ్యవసాయ సలహా మండలి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించి ఈ-కేవైసీ గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించారని తెలిపారు. గడువులోపు ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకే తదుపరి విడత పీఎం కిసాన్ నగదు విడుదల చేస్తారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేత శివకుమార్, వీఆర్వో వెంకయ్య, వీఏఏ నవీన్ పాల్గొన్నారు.

నేత్రదానం

కోవూరు(విడవలూరు) : విడవలూరుకు చెందిన కంచర్ల వెంకమ్మ (70) అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కుటుంబ సభ్యుల ఆమోదంతో మృతురాలి నేత్రాలను సోమవారం మన సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల ల్యాబ్ టెక్నీషియన్ లాలేష్, బాలాజీలు సేకరించినట్లు సంస్థ నిర్వాహకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

దళారులను ఆశ్రయించొద్దు



బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ

మనుబోలు : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలు దళారులను ఆశ్రయించొద్దని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. మనుబోలు తహసీల్దార్‌గా ఉన్న సుధీర్ ఇటీవల బదిలీపై వెళ్లడంతో లక్ష్మీనారాయణ నూతన తహసీల్దార్‌గా సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట డీటీ బాలకోటమ్మ, ఆర్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

నెల్లూరు(క్రైమ్): బైక్ అదుపుతప్పడంతో ఇద్దరు విద్యార్థులు గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు..ప్రశాంతినగర్‌కు చెందిన ఏ పవన్‌కుమార్, ఎస్ పవన్‌కుమార్ పదోతరగతి విద్యార్థులు. సోమవారం వారు విజయమహల్‌గేటు సమీపంలోని ఓ పాఠశాలలో పదోతరగతి పరీక్ష రాసేందుకు బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరారు. ఆత్మకూరుబస్టాండ్ ఫ్లైఓవర్‌బ్రిడ్జి వద్దనున్న సాయిబాబాగుడి సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడి ఇద్దరి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటివారిపై పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు...నవాబుపేటకు చెందిన వెంకటేశ్వర్లు, హేమలత దంపతులు. వెంకటేశ్వర్లు తన కుటుంబసభ్యులతో కలిసి గత కొంత కాలంగా భార్యను అదనపు కట్నం కోసం వేధించసాగారు. వారి వేధింపులు భరించలేని భార్య సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాలకు కండలేరు జలాలు

- రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పార్లపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : మండలంలోని పార్లపల్లి, ఇనుకుర్తి, ముదిగేడు, మర్రిపల్లి, బిరదవోలు తదితర గ్రామాలకు శాశ్వత ప్రాతిపదికన కండలేరు ఎడమగట్టు కాలువ ద్వారా సాగునీటిని అందిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పార్లపల్లి, చెర్లోపల్లి, కల్యాణపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. కండలేరు ఎడమకాలువ ద్వారా పై గ్రామాలకు తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీటిని అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కండలేరు కాలువకు రూ.40 కోట్లతో లైనింగ్ పనులను చేపడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. పార్లపల్లి గ్రామానికి మెయిన్‌రోడ్డు నుంచి గ్రామంలోకి రోడ్డు నిర్మిస్తానని గత ప్రభుత్వంలో మంత్రిగా వెలగబెట్టిన నాయకుడు కాగితాలకే పరిమితం చేస్తే తమ ప్రభుత్వం నిధులు సాధించి పూర్తి చేసినట్లు తెలిపారు. రేషన్‌కార్డుల పంపిణీకి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా త్వరలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

రోడ్లు, డ్రెయిన్ల ప్రారంభం

పార్లపల్లి, చెర్లోపల్లి, కల్యాణపురం గ్రామాల్లో రూ.1.90 కోట్ల నిధులతో పూర్తయిన సిమెంటు రోడ్లకు, రూ.60 లక్షలతో చేపట్టిన సైడ్‌డ్రెయిన్లను మంత్రి కాకాణి ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.కోట్లాది నిధులను వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆర్.దశరథ రామయ్యగౌడ్, సర్పంచ్ బి.వెంకటరమణమ్మ, నేతలు ఎస్.పెంచలయ్య, బి.పెంచలరెడ్డి, ఎస్.గోపాలయ్య, వి.దయాకర్‌రెడ్డి, ఎ.గంగిరెడ్డి, ఎ.బుజ్జిరెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే ప్రజాభిమానం



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజాభిమానం పతాక స్థాయిలో ఉందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఇప్పటి వరకు 62,032 గడపలు తిరిగినట్లు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తోందన్నారు.

చెక్కు అందజేత

గ్రామంలోని 22 స్వయం సహాయక సంఘాలకు రూ.1.60 కోట్ల బ్యాంకు లింకేజీ రుణం నమూన చెక్కును ఎమ్మెల్యే ప్రసన్న మహిళలకు అందజేశారు. ఈ నగదుతో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కైలాసం లావణ్య, లేబూరు వెంకురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సి.రమ్య, టి.గంగమ్మ, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, సీడీపీఓ హేనాసుజన్, ఏఈ వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు సిద్ధం చేసుకోవాలి

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వలంటీర్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నాయకులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15, 17వ తేదీల్లో కొడవలూరులో స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతున్నందున సంక్షేమ పథకాల ద్వారా పేదలకు జరిగిన మేలును వారికి వివరించాల్సి ఉందని, ఈ మేరకు వివరాలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులుంటే గుర్తించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు ఒట్టూరు సునీతమ్మ, పొబ్బా రవి, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద సోమవారం జరిగింది. నెల్లూరు నగరం కిసాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మున్వర్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కసుమూరు మలుపురోడ్డు వద్ద ఎదురుగా కారు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మున్వర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-పంట పత్రాలతో ప్రయోజనం

- ఏడీఏ రాజ్‌కుమార్



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

ముత్తుకూరు : ఈ-పంట ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్న రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని వల్లూరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు ఈ-పంట ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. హార్టీ కల్చర్ బోర్డు సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఏఏబీ చైర్మన్ పోచారెడ్డి చెంగారెడ్డి, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి పాల్గొనగా, ఏడీఏ ప్రసంగించారు. ఈ-పంట ధ్రువీకరణ పత్రాలు ఉంటే బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. త్వరలో ఎడగారు వరిసాగుకు నీరు విడుదల చేస్తారని, ఈ సీజన్‌కు అనువైన వంగడాలు ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు.

కూచిపూడి నృత్యకారిణులకు సన్మానం



బాలికలను సన్మానిస్తున్న నిర్వాహకులు

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన కూచిపూడి నృత్యకారిణులకు శ్రీశ్రీ కళావేదిక వారు సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో మడమనూరుకు చెందిన పృథ్వీ పూర్ణిమ, చేవూరి పావని సులక్షిత, ప్రియదర్శిని పాల్గొని నాట్య ప్రతిభను ప్రదర్శించారు. దీంతో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌తో పలువురు ప్రముఖులు బాలికలకు షీల్డులు అందజేసి సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. దీంతో గ్రామస్తులు బాలికలను సోమవారం అభినందించారు.

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం



విశేషాలంకరణలో సీతారాములు



ఏకాంతసేవలో స్వామి, అమ్మవార్లు

మనుబోలు : శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం, గ్రామోత్సవాలు మనుబోలు పడమటి వీధిలో ఆదివారం అర్ధరాత్రి నేత్రపర్వంగా సాగింది. ముందుగా అర్చకుడు కుమారస్వామి సీతారాములకు అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం సీతారాముల గ్రామోత్సవం వేడుకగా సాగింది. ఉచ్చూరు లక్ష్మీనరసారెడ్డి -తనూజమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

శాస్త్రోక్తంగా ఏకాంతసేవ

కోదండరామపురం రామాలయంలో సీతారాములకు ఏకాంతసేవను ఆదివారం రాత్రి అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొమ్మిది రకాలు స్వీట్లు, పండ్లను నూతన దంపతులకు నైవేద్యంగా సమర్పించారు. దువ్వూరు సుధాకర్‌రెడ్డి-రాజేశ్వరమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- గ్రామాల్లో ముమ్మరంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



ముత్తుకూరులో కరపత్రాలు అందజేస్తున్న నేతలు



వెంకటాచలం : తిక్కవరప్పాడులో కరపత్రాలు అందజేస్తున్న వెంకటశేషయ్య

ముత్తుకూరు : వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని ఎంపీపీ సుగుణమ్మ అన్నారు. ముత్తుకూరు పంచాయతీలో సోమవారం నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపిస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు నవీద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు ప్రాధాన్యం

వెంకటాచలం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలులో అన్నివర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి మండల వెంకటశేషయ్య పేర్కొన్నారు. మండలంలోని సర్వేపల్లి, తిక్కవరప్పాడు, వెంకటాచలం తదితర గ్రామాల్లో సోమవారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగారు. చంద్రబాబు హయాంలో మహిళలకు, రైతులకు రుణమాఫీ చేస్తానని మోసం చేశాడని గుర్తుచేశారు. అయితే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారని పేర్కొన్నారు.

విశేష స్పందన

తోటపల్లిగూడూరు : 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని సచివాలయాల మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొట్లపూడి, విలుకానుపల్లి, కొత్తపాళెం గ్రామాల్లో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ క్రమంలో ఆయా పంచాయతీల్లో ప్రజల అభిప్రాయాలతో కూడిన బుక్‌లెట్లను గృహసారథులు పార్టీ నేతలకు అందజేశారు. ఈ సందర్భంగా చిల్లకూరు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, దీంతో ప్రజలు ఎంతో సంతోషంతో ఉన్నారన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

కొడవలూరు : పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య అన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెం, బసవాయపాళెంలలో సోమవారం నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతిఇంటా సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత పి.సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తాటిపర్తిలో..

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి మేజర్ పంచాయతీలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు అమలు తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఉప సర్పంచ్ పాములూరు లచ్చారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఆర్.చెంచురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని అన్ని గ్రామాలతో పాటు బుచ్చి పట్టణంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సోమవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి గత మూడున్నరేళ్లలో జరిగిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల పనితీరును వివరించారు.



బుచ్చిరెడ్డిపాళెం : 14వ వార్డులో..



కోవూరు మండల కేంద్రంలో..

ఉత్సాహంగా..

కోవూరు : 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం కోవూరు, విడవలూరు మండలాల్లో సోమవారం ఉత్సాహంగా జరిగింది. గ్రామాల్లో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అన్యాయాలను గుర్తుచేశారు. అనంతరం లబ్ధిదారుల మద్దతుతో ఇంటికి స్టిక్కర్‌ను అంటించారు. కోవూరులో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ కవరగిరి ప్రసాద్, పార్టీ నేత అత్తిపల్లి అనూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : పొట్లపూడిలో..



కొడవలూరు: గుండాలమ్మపాళెంలో..



పొదలకూరు : తాటిపర్తిలో..

నిత్యాన్నదానానికి విరాళం



అన్నదానానికి నగదు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదానానికి దాతలు సోమవారం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ యూఎస్‌ఏలో నివాసం ఉంటున్న పుచ్చలపల్లి వినయ్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వరమ్మ పేర్ల మీద దొడ్ల జానకమ్మ రూ.20 వేల నగదు అందజేసినట్లు తెలిపారు. అలాగే బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన చేవూరు వినోద్‌కుమార్ - ఉమాలత దంపతులు రూ.5,116 అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు గుమ్మా రఘురామయ్య, గుంటూరు కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

నెల్లూరు(క్రైమ్) : ఎడ్ల బండిని కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు...హరనాథపురం రెండోవీధికి చెందిన వెంకటరెడ్డి ఎడ్ల బండిపై రోజూ పొలం పనులకు వెళ్లి వస్తుంటాడు. సోమవారం వేకువన రోజూలాగే పొలానికి వెళ్లారు. అక్కడ పనులు పూర్తి చేసుకుని ఎడ్ల బండిపై ఇంటికి బయలుదేరారు. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జాతీయరహదారిని దాటుతుండగా చెన్నై నుంచి కావలి వైపు వెళుతున్న కారు వేగంగా ఎడ్ల బండిని ఢీకొంది. ఎడ్ల బండి రోడ్డుపక్కగా పడిపోగా వెంకటరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కారుడ్రైవర్ కారును అక్కడే వదిలి పరారయ్యాడు. 108 సిబ్బంది క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలోని శేషాద్రినగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి సహకారంతో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిధుల నుంచి రూ.10 లక్షలను రోడ్డు నిర్మాణానికి కేటాయించారని, వీటితో సిమెంట్ రోడ్డును వేస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని నూతన తహసీల్దార్ వీరి సుధీర్‌బాబు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను మనుబోలు మండలం నుంచి సాధారణ బదిలీలో భాగంగా వచ్చానన్నారు. అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.